6న ఎంఎస్‌ఎంఇ రిజిస్ట్రేషన్‌పై అవగాహన

శ్రీకాకుళం సిటీ : సూక్ష్మ, చిన్న, మధ్య తరహా (ఎంఎస్‌ఎంఇ) పరిశ్రమలు, ఉద్యమ రిజిస్ట్రేషన్‌పై ఈ నెల 6న జెడ్‌పిలో అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ జి.ఎం.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఉదయం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉంటుందన్నారు. అలాగే అవగాహనా సదస్సులో పాల్గొన్నవారికి మధ్యాహ్నం భోజన ఏర్పాట్లు చేశామన్నారు. ఈ అవకాశాన్ని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పురోగతి ఏదీ?

- అడుగు ముందుకు పడని సాగునీటి ప్రాజెక్టులు
- అమలు కాని ఐటిడిఎ, జీడి మద్దతు ధర హామీలు
- విద్యుత్, రిజిస్ట్రేషన్ ఛార్జీల రూపాల్లో ప్రజలపై భారాలు
- ఇదీ కూటమి ప్రభుత్వం ఏడాది పాలన తీరు

టిడిపి కూటమి ప్రభుత్వం ఘన విజయం సాధించి బుధవారం నాటికి ఏడాది పూర్తవుతోంది. గెలుపు కోసం సూపర్ సిక్స్ హామీలతో పాటు జిల్లాకు సంబంధించి ప్రత్యేక హామీలను ఇచ్చింది. జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు, జీడి పిక్కలకు మద్దతు ధర, బోర్డు ఏర్పాటు, పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి వంటి అనేక వాగ్దానాలను గుప్పించారు. వాటిలో ఒక్కటీ నెరవేరలేదు. పైగా పలాస కార్గో ఎయిర్ పోర్టు, సరుబుజ్జిలి-బూర్జ ప్రాంతంలో థర్మల్ పవర్ ప్లాంట్ వంటి అంశాలను తెరపైకి తెచ్చి ఆయా ప్రాంతాల్లో ఆందోళనలు రేపింది. మరోవైపు విద్యుత్, రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచి ప్రజలపై భారాలను మోపింది.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి



గతేడాది పలాసలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు నాయుడు (ఫైల్)

జిల్లాలో వంశధార ప్రాజెక్టు ఫేజ్-2 స్టేజ్-2, ఆఫ్‌షోర్ రిజర్వాయరు, వంశధార-నాగావళి నదులను అనుసంధానం పూర్తి చేస్తామని, జిల్లాను సస్యశ్యామలం చేస్తామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు పలు బహిరంగ సభల్లో హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడే నాటికి వంశధార ప్రాజెక్టుకు సంబంధించి 87 ప్యాకేజీ పనులు 80 శాతం, 88 ప్యాకేజి పనులు 95 శాతం పనులు పూర్తయ్యాయి. హిరమండలం రిజర్వాయరు పనులు 95 శాతం పూర్తయ్యాయి. స్వల్ప శాతం మాత్రమే పెండింగ్‌లో ఉన్న వీటిని ఏడాదిలోపే పూర్తి చేసి రైతులకు సాగు నీరందించే అవకాశం ఉన్నా కూటమి ప్రభుత్వం ఆ పని చేయలేకపోయింది. వంశధార-నాగావళి అనుసంధాన పనులు 73 పూర్తి కాగా, కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైనా పనుల్లో పెద్దగా పురోగతి లేదు. గతేడాది ఎన్నికల సమయానికి ఆఫ్‌షోర్ రిజర్వాయరు పనులు 45 శాతం మాత్రమే పూర్తయ్యాయి. ఇప్పటికీ అదే పరిస్థితి ఉంది.

అమలు కాని ప్రధాన హామీలు

గతేడాది మేలో ఎన్నికల ప్రచారం కోసం పలాస వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు జీడి పంటకు మద్దతు ధర ప్రకటిస్తామని, జీడి బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఏడాది కాలం గడచినా దానిపై ఒక్క అడుగూ పడలేదు. ప్రభుత్వం నిర్ణయంతో సత్వరం అమల్లోకి వచ్చే ఇటువంటి అంశాన్ని అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం నాన్చుతోంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా పాతపట్నం సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఐటిడిఎ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినా ఇప్పటివరకు ఒక్క అడుగూ పడలేదు. ఐటిడిఎ ఏర్పాటు చేయాలంటూ కలెక్టరేట్, మండల కేంద్రాల్లో సైతం ధర్నాలు నిర్వహించినా ఫలితం కనిపించలేదు. కార్పొరేట్లకు, పారిశ్రామిక వేత్తలకు అనుకున్నదే తడవుగా భూములను ఇచ్చేస్తున్న ప్రభుత్వం ఐటిడిఎ ఏర్పాటుకు భూములను సేకరించేందుకు సిద్ధపడటం లేదు.

ఎయిర్‌పోర్టు, థర్మల్ ప్లాంట్ల పేరుతో కలకలం

జిల్లాకు ఏం మేలు చేయనుందోనని టిడిపి కూటమి ప్రభుత్వంపై గంపెడాశలు పెట్టుకున్న జిల్లా ప్రజలకు షాక్ ఇచ్చింది. ప్రభుత్వం ఏర్పడిన కొద్ది నెలల్లోనే జిల్లాకు ఎయిర్ పోర్టు వస్తుందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు, పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రకటించారు. అందుకు మందస ప్రాంతాన్ని ఎంపిక చేయడంతో అప్పటివరకు ప్రశాంతంగా ఆయా గ్రామాల్లో ఒక్కసారిగా కలకలం రేగింది. కార్గో ఎయిర్ పోర్టు వద్దంటూ వివిధ గ్రామాల ప్రజలు నిరసన తెలుపుతూనే ఉన్నారు. సరుబుజ్జిలి-బూర్జ ప్రాంతంలో థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రకటించడం, జెన్‌కో అధికారులు ఆ ప్రాంతంలో పర్యటించడంతో ఆ ప్రభావానికి లోనయ్యే గ్రామాల ప్రజలు వివిధ రూపాల్లో ఆందోళనలతో నిరసన వ్యక్తం చేశారు.

నిర్వాసితులకు ఏదీ న్యాయం?

2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం భూ సేకరణ చట్టం-2013 అమలు చేయకుండా రూ.ఐదు లక్షల ప్యాకేజీతో సరిపెట్టింది. నిర్వాసితులకు టిడిపి అన్యాయం చేసిందని తాము అధికారంలోకి వస్తే 2013 చట్టం అమలు చేస్తామంటూ అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం 2022 జూన్‌లో రూ.లక్ష ఎక్స్‌గ్రేషియా చెల్లించి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. జిల్లాలో ప్రాజెక్టుల పరిశీలనకు 2024లో కొత్తూరు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్వాసితులకు న్యాయం చేస్తానంటూ హామి ఇచ్చారు. ఏడాది గడిచినా అమలుకు నోచుకోలేదు.

ప్రజలపై భారాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కరెంట్ ఛార్జీలను పెంచి ప్రజలకు షాకిచ్చింది. ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజి కాస్ట్ అడ్జెస్ట్‌మెంట్ (ఎఫ్‌పిపిపిసిఎ) పేరుతో గతేడాది డిసెంబర్ నుంచి ప్రజల నుంచి వసూలు చేయడం ప్రారంభించింది. పూరి గుడిసెల్లో నివసిస్తున్న వారికి సైతం భారీగా కరెంట్ బిల్లులు వచ్చాయి. కరెంట్ బిల్లుల వాత తర్వాత ఆస్తుల రిజిస్ట్రేషన్ ఫీజులను భారీగా పెంచింది. ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి స్థిరాస్తుల విలువలను అమాంతంగా పెంచి అమలు చేసింది. భూములతో పాటు ప్లాట్లు, ఇళ్లు తదితర స్ట్రక్చర్ల విలువలను పెంచింది. వాణిజ్యపరంగా డిమాండ్ ఉన్న ప్రాంతాలు, పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ప్రాంతాలతో పాటు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న భూములకు డిమాండ్‌ను బట్టి పది నుంచి 50 శాతం పెంచింది.

చేనేత కార్మికులతో మాట్లాడుతున్న గోవిందరావు

చేనేత కార్మికులను ఆదుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

ప్రజాశక్తి- లావేరు

టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు మగ్గమున్న ప్రతి చేనేత కార్మికునికీ 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.వి.రమణ, చేనేత కార్మిక సంఘం నాయకులు నక్కిన అసిరప్పడు డిమాండ్ చేశారు. మంగళవారం లావేరులో పర్యటించి చేనేత కార్మిక సమస్యలపై సమావేశం నిర్వహించి అనంతరం మగ్గాల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికులకు గిట్టుబాటు ధర లేక, మరొక పనికి పోలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని ప్రకటించి ఇప్పటికీ అమలు చేయలేదని అన్నారు. దీనివల్ల చేనేత కార్మికులు మగ్గాలు నేయలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత కార్మికులకు అంత్యోదయ కార్డులు మంజూరు చేయాలని కోరారు. చేనేతకు కేటాయించిన 11 రకాల ఉత్పత్తులను మిల్ మగ్గాలపై తయారు చేయకుండా చేనేత కార్మికుల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. చేనేత సహకార సంఘాలకు రుణమాఫీ చేసి ఆప్కో దారా ప్రభుత్వం వస్త్రాలు కొనుగోలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్‌లో రూ.2000 కోట్లు కేటాయించాలన్నారు. చేనేతపై జిఎస్‌టిని పూర్తిగా రద్దు చేయాలని రద్దు చేయాలన్నారు. నేతన్న నేస్తాన్ని మగ్గం ఉన్న ప్రతి కార్మికునికీ అమలు చేయాలన్నారు. ప్రయివేటు సెక్టార్‌లో త్రిఫ్ట్ ఫండ్ స్కీమ్‌ను అమలు చేయాలన్నారు. పట్టు, నూలు 2021 నాటి ధరలకు తగ్గించాలని, చేనేత మహిళలకు ప్రసూతి సమయంలో ఆర్థిక సహాయం అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘ నాయకులు కె.శంకర్రావు, కె.రామారావు, యు.గంగ రాజు, కె.గోవిందరావు, ఎన్.భద్రకాళి బి.వెంకట్రావు, యు.కాశీవిశ్వేరరావు, ఎ.శ్యామలరావు పాల్గొన్నారు.

ఎండియు ఆపరేటర్లపై నిందలు తగవు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

సూర్యనారాయణ

రేషన్ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేస్తూ చాలీచాలని జీతాలతో ఉపాధి పొందుతున్న తమపై సిఎం చంద్రబాబు నాయుడు ఎండియు ఆపరేటర్లు దుర్మార్గులు అని వ్యాఖ్యలు చేయడం బాధాకరమని రేషన్ వాహనాల డ్రైవర్ల అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రౌతు సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎండియుల ద్వారా ప్రజలకు బియ్యాన్ని పంపిణీ చేయకుండా కాకినాడ పోర్టుకు నేరుగా అక్రమ రవాణా చేస్తున్నామని అన్నారు. అధికారులను, రాజకీయ నాయకులను కొనేశామని, చివరికి సిఎంనూ కొనేయాలని చూశామంటూ తమపై కాకినాడ ప్రజావేదికలో ముఖ్యమంత్రి దిగజారుడు వ్యాఖ్యలు చేశారని ధ్వజమెత్తారు. పౌరసరఫరాశాఖ మంత్రి మనోహర్ కుట్రపూరితంగా తమపై బురదజల్లారని దుయ్యబట్టారు. కరోనా సమయంలోనూ కుటుంబ సభ్యులే బాధితుల దగ్గరకు వెళ్లని పరిస్థితుల్లో తాము ధైర్యంగా నిత్యావసరాలు పంపిణీ చేశామని వివరించారు.

యోగాసనాలు వేస్తున్న కలెక్టర్, తదితరులు

యోగాసనాలతో శారీరక రుగ్మతలు దూరం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

యోగాసనాలతో శారీరక రుగ్మతలు దూరమవుతాయని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మండలంలోని పెద్దగణగళ్లవానిపేట తీర ప్రాంతంలో యోగాంధ్ర-2025లో భాగంగా మంగళవారం నిర్వహించిన యోగా కార్యక్రమంలో పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు మేరకు యోగా మాసంలో భాగంగా ఉదయం 7 నుంచి 8.30 గంటల వరకు యోగాసనాలను వేశామన్నారు. మత్స్యకారులు రోజూ సముద్రంలోకి వేటకు వెళ్తారని, వారికి ఈ యోగా మరింత ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మనసు ప్రశాంతంగా, ఆరోగ్యంగా ఉండాలంటే యోగాసనాలు వేయాలన్నారు. ఇంటి, పార్కుల వద్ద రోజూ యోగాసనాలు వేసుకోవచ్చన్నారు. ఐదు వేల మంది పైనే మత్స్యకారులు పాల్గొన్నట్లు చెప్పారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21వ తేదీన విశాఖపట్నంలో ప్రధాని ఐదు లక్షల మందితో నిర్వహించనున్నట్లు వివరించారు. జిల్లా అటవీ శాఖ అధికారి వెంకటేష్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వ రరావు, శ్రీకాకుళం ఆర్‌డిఒ కె.సాయి ప్రత్యూష, టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, డ్వామా పీడీ సుధాకరరావు, డిఎంహెచ్ఒ డాక్టర కె.అనిత, స్త్రీ, మహిళా శిశు సంక్షేమశాఖ పీడీ బి.శాంతిశ్రీ, వికలాంగులశాఖ ఎడి కె.కవిత, ఆయుష్ డాక్టర్ జగదీష్, పెద్దగణగళ్లవానిపేట ఎంపిటిసి అమ్మాజీరావు, సర్పంచ్ బర్రి రామారావు, జిల్లా మత్స్యశాఖ అధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

పచ్చదనమే లక్ష్యం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జూన్ 5న పురస్కరించుకుని జిల్లాను పచ్చదనంతో నింపడమే లక్ష్యంగా, మొక్కలు నాటే కార్యక్రమాన్ని మిషన్ మోడ్‌లో పూర్తి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా, మండలస్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మొక్కల సంఖ్య, వాటి లభ్యతను కచ్చితంగా అంచనా వేయాలన్నారు. ట్రీ గార్డులు సిద్ధం చేయాలని సూచించారు. సోక్ పిట్స్, కంపోస్ట్ పిట్స్ పూర్తి చేయాలని కీలక సూచనలు చేశారు. కాంపౌండ్ వాల్ లేని ప్రదేశాల్లో వరుసగా మొక్కలు నాటాలని, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, జూనియర్ రెడ్ క్రాస్, వెల్ఫేర్ అసోసియేషన్లను ఈ కార్యక్రమంలో భాగస్వాములుగా చేయాలని పిలుపునిచ్చారు. 'యోగాంధ్రా కోసం ముందస్తు సన్నాహాలను వేగవంతం చేయాలని సూచించారు. ప్రధాని పాల్గొనే ఈ కార్యక్రమానికి శ్రీకాకుళం, ఎచ్చెర్ల, ఆమదాలవలస ప్రాంతాల నుంచి 20 వేల మంది యోగా అభ్యాసకులను సిద్ధం చేయాలని నిర్దేశించారు. అన్న క్యాంటీన్లలో ఆహార నాణ్యత, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ ఎరువులు, విత్తనాల సరఫరాలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మాదకద్రవ్యాలు, మహిళలపై నేరాల నివారణకు పోలీస్ విభాగం కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఉపాధి హామీ పథకం కింద వంశధార, ఇతర ప్రాజెక్టుల్లో మొక్కలు నాటడం, సీజనల్ వ్యాధుల నివారణకు వేగంగా నీటి నమూనాల పరీక్షలు చేపట్టడం, వర్షాకాలం దృష్ట్యా కాలువల శుభ్రతపై మున్సిపల్, డిపిఒ సమన్వయంతో పనిచేయడం వంటి అంశాలపైనా సమీక్షించారు. జిపిఎ, జివిఎ పెంపు అంశాల్లో అన్ని శాఖల చురుకైన పాత్ర ఉండాలని స్పష్టం చేశారు. నియోజకవర్గాల వారీగా విజన్ యాక్షన్ ప్లాన్ అమలును స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. సమీక్షలో జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజా, సిపిఒ ప్రసన్నలక్ష్మి, వ్యవసాయశాఖ జెడి త్రినాథస్వామి, పీడీ శాంతిశ్రీ, హౌసింగ్ పీడీ నాగేష్, విద్యుత్‌శాఖ ఎస్ఇ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

నిజమైన 'వెన్నుపోటు' జగన్ రెడ్డిదే

ప్రభుత్వ విప్ అశోక్

ప్రజాశక్తి- కవిటి

అశోక్, విప్

తననే నమ్ముకుని, తాను జైల్లో మగ్గుతుంటే ఆడబిడ్డైనా పాదయాత్ర చేసి పార్టీ ఉనికిని కాపాడిన సొంత చెల్లి షర్మిల, కనిపించిన తల్లి విజయమ్మను గెంటేసిన మహానుభావుడు, నిజమైన వెన్నుపోటుదారుడు మాజీ సిఎం జగన్మోహన రెడ్డేనని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ఒక ప్రకటనలో ఆరోపించారు. శివకుమార్ స్థాపించిన వైసిపి కబ్జాతో ప్రారంభమైన జగన్ రెడ్డి దాష్టీకం ఎత్తుకొని పెంచిన బాబాయిని గొడ్డలివేటితో చంపడంతో పరాకాష్టకు చేరుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్ల పాలనలో 85 శాతం హామీలు విస్మరించారని అన్నారు. మద్యపాన నిషేధం అంటూ విషపూరిత మద్యాన్ని విక్రయించారని విమర్శించారు. బడుగు, బలహీనుల ఆరోగ్యంతో ఆటలాడుకున్నాడని ఎద్దేశా చేశారు. ఏటా జనవరి నెలలో డిఎస్‌సి అంటూ నిరుద్యోగులకు, అన్న క్యాంటీన్లు రద్దు చేసి పేదల వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. అదే సమయంలో మొదటి ఏడాదిలోనే 70 శాతం హామీలు అమలు చేసిన కూటమి ప్రభుత్వం ప్రజల్లో మెప్పు పొందడం చూడలేక వెన్నుపోటు దినం అంటూ తన పార్టీకే తాను తద్దినం పెట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్లు రూ.4 వేలకు పెంచి, మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు అర్హులకు అందిస్తున్నామని అన్నారు. ప్రజారంజిక పాలనను చూసి ఓర్వలేక జగన్ రెడ్డి మతిభ్రమిస్తోందని అశోక్ ఎద్దేవా చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం పోస్టల్ డివిజన్‌లో పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో డైరెక్ట్ ఏజెంట్లుగా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పోస్టల్ సూపరింటెండెంట్ వండాన హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అన్నారు. దరఖాస్తులు సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ శ్రీకాకుళం డివిజన్-532 001 వారి చిరునామాపై, రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా కానీ, స్పీడ్ పోస్ట్ ద్వారా కానీ పంపాలన్నారు. దరఖాస్తుతో ఆధార్ కార్డు, పాన్ కార్డు జెరాక్స్ పంపించాలన్నారు. ఇన్సూరెన్స్ డైరెక్టర్ ఏజెంట్ కేవలం చేసిన పాలసీలపై కమీషన్ ఆధారితం మాత్రమేనని, ఇది ఎటువంటి ఉద్యోగ ప్రకటన కాదని గమనించాలన్నారు.

డ్రోన్ నిఘా నీడలో నగరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

బహిరంగంగా మద్యం సేవించడం, గంజాయి సేవించడం, పేకాట, ఈవిటీజింగ్, చైన్ స్నాచింగ్, పేకాట, జూదం తడితర నేరాలపై డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశామని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి తెలిపారు. శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 80 అడుగుల రహదారి, డచ్ బంగ్లా, వాంబే కాలని, కంపోస్టు, పొన్నాడ వంతెన తదితర నాగావళి నది పరివాహక ప్రాంతాలు, పట్టణ చివర ప్రాంతాల్లో పాడుపడిపోయిన బంగ్లాలు, నివాస గృహాలపై డ్రోన్ కెమెరాలతో మంగళవారం చిత్రీకరించామన్నారు. బహిరంగంగా మద్యం సేవించడం గంజాయి సేవించడం వంటి వారు పట్టుబడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయా ప్రాంతాల్లో బహిరంగ మద్యం సేవించడం, గంజాయి వినియోగం చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహణ, ఈవ్ టీజింగ్, ఇతర నేరాలు జరగకుండా చర్యలు చేపడతామని తెలిపారు.

తీర్థయాత్రలకు ప్రత్యేక ప్యాకేజీ

ఐఆర్‌సిటిసి టూరిజం ఎగ్జిక్యూటివ్ సంఘమిత్ర రౌల్

టూర్ ప్యాకేజీ వివరాలను వెల్లడిస్తున్న సంఘమిత్ర రౌల్

ప్రజాశక్తి- ఆమదాలవలస

తీర్థయాత్రలకు వెళ్లాలనుకునే యాత్రికుల కోసం రైల్వే శాఖ ప్రత్యేక ఎయిర్ రైల్వే ప్యాకేజీలతో ప్రయాణ సదుపాయంతో నడుపుతున్నట్లు ఐఆర్‌సిటిసి టూరిజం ఎగ్జిక్యూటివ్ సంఘమిత్ర రౌల్ తెలిపారు. మంగళవారం శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వే స్టేషన్‌లోని విఐపి లాంజ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఐఆర్‌సిటిసి ఆధ్వర్యాన జిల్లా ప్రజలకు అనుకూలంగా విమాన ప్యాకేజీతో శాంకరీ దేవి శక్తి పీఠంతో శ్రీలంక రామాయణ యాత్ర విశాఖపట్నం నుంచి విమాన సర్వీసును నడుపుతున్నట్లు తెలిపారు. ఈ సర్వీసు జూన్ 28న మొదలై జూలై 3తో ముగుస్తుందని అన్నారు. టూరిస్టులకు ఉదయం టీ, అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి శాఖాహార భోజనం ఉంటుందన్నారు. ప్రయాణికులకు ప్రమాద బీమా ప్రొఫెషనల్, స్నేహపూర్వ టూర్ ఎస్కార్ట్‌లో సేవలు రైల్లో భద్రత తదితర బాధ్యతలన్నీ ఐఆర్‌సిటిదేనని తెలిపారు. ప్రయాణికులు వివరాలకు www.irctctourism.com ను చూడాలన్నారు. మరిన్ని వివరాలకు చందన్ కుమార్ 9281030748, సాయిప్రసాద్ 9281495847, వెంకటేశ్వరరావు 9550166168 నెంబర్లను సంప్రదించాలని కోరారు. సమావేశంలో స్టేషన్ సూపరింటెండెంట్ ఎస్.ఉమామహేశ్వరరావు, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జి.వినేష్ పాల్గొన్నారు.

నితిన్ గడ్కరీతో మాట్లాడుతున్న రామ్మోహన్ నాయుడు

నితిన్ గడ్కరీతో రామ్మోహన్ నాయుడు భేటీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

పాతపట్నం వద్ద నిర్మిస్తున్న ఆర్‌ఒబి కారణంగా నీలమణి అమ్మవారి ఆలయం ప్రాంగణం ఎర్త్ వాల్ వల్ల మూసుకుపోతుందని, దీంతో యాత్రికులకు ఇబ్బందికరంగా మారుతుందని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఈ మేరకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని మంగళవారం కలిశారు. 110 మీటర్ల విడక్ట్ నిర్మాణం చేపట్టి ఆలయానికి నేరుగా వెళ్లేలా మార్గం చూపాలన్నారు. దీనికి సుమారు రూ.8 కోట్లు అదనపు ఖర్చు అవుతుందని, అధికారులు ప్రాథమిక అంచనా వేశారని చెప్పారు. జిల్లా నుంచి సాగే జాతీ రహదారి నరసన్నపేట వరకే ఆరు వరసలుగా ఉందని అన్నారు. చెన్నయ్-కలకత్తా జాతీయ రహదారిపై ఉన్న రద్దీ దృశ్య నరసన్నపేట నుంచి ఇచ్ఛాపురం వరకు ఆరు వరుసలుగా విస్తరించాలని కోరారు.

ఐటిఐ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

ఐదు నుంచి ఎనిమిది వరకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లాలోని మూడు ప్రభుత్వ ఐటిఐలు శ్రీకాకుళం డిఎల్‌టిసి, ఎచ్చెర్ల, పలాస, 20 ప్రయివేట్ ఐటిఐల్లో 2025-2026 విద్య సంవత్సరానికి ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఏడాది, రెండేళ్ల ట్రేడుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటిఐలో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, మెకానిక్ మోటార్ వెహికల్, డ్రాఫ్టుమ్యాన్, సివిల్ రెండేళ్లు, వెల్డర్, మెకానిక్ డీజిల్, కట్టింగ్ అండ్ సుయింగ్, కోపా ట్రేడ్స్ ఏడాది శిక్షణ ఉంటుంది. మూడు ప్రభుత్వ ఐటిఐ కళాశాలల్లో 640 సీట్లు, 20 ప్రయివేటు ఐటిఐ కళాశాలల్లో 2872 సీట్లు ఉన్నాయి. ఐటిఐ ప్రవేశాలు కౌన్సెలింగ్ పారదర్శకంగా నిర్వహిస్తామని కన్వీనర్ ఎల్.సుధాకర్ తెలిపారు. పదో తరగతి మార్కులు, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని అన్నారు. ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో విద్యార్థులు హాజరు కావాలన్నారు. ఉన్నత అధికారుల పర్యవేక్షణలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారు.

ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటిఐ కళాశాల

IN THE HONOURABLE COURT OF THE 3rd ADDITIONAL JUDGE CUM FAMILY COURT AT SRIKAKULAM. F.C.O.P. 02/2025.

Between:
మోఖలింగం సునీల్ కుమార్ పట్నాయక్
....పిటిషనర్

And:
మోఖలింగం ధనలక్ష్మి @ మణిపాత్రుని ధనలక్ష్మి
....ప్రతివాది

To,
Mokhalingam Dhana Lakshmi @ Manipatruni Dhana Lakshmi, W/o Mokhalingam Sunil Kumar Patnaik, D/o late Manipatruni Venkata Gangadhara Patnaik, residing at 28 LIG, APHB Colony, Srikakulam (Town&Post&District).

పై నెంబరు కేసులో పిటిషనర్ డైవర్స్ పిటిషన్ మీ పై దాఖలు చేయగా సదరు కేసు **తేది 24-6-2025న ఉదయం 10.30 ని॥లకు పై కోర్టులో మీ హాజరు నిమిత్తం వాయిదా ఉన్నది.** మీరు స్వయంగా కానీ, న్యాయవాది గారి ద్వారా కానీ హాజరై మీ వాదనలు తెలియజేసుకొనవలెను. లేనిచో సదరు మీ కేసు విచారించి మీ పరోక్షమునందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

// By order of the Court //
పంచిరెడ్డి ఈశ్వరరావు, న్యాయవాది,
శ్రీకాకుళం, సెల్ నెం: 9949502216.

క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకూర్మంలో క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

శ్రీకూర్మానికి పూర్వ వైభవం తీసుకువస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకూర్మం పుణ్యక్షేత్రం అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా స్థానిక గ్రౌండ్‌లో గ్రామ ప్రజలు క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే శంకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని క్రికెట్ పోటీలను ప్రారంభించి మాట్లాడుతూ ప్రపంచంలో శ్రీకూర్మం దేవస్థానానికి ప్రాముఖ్యత ఉందని, ప్రభుత్వ సహకారంతో శ్రీకూర్మం పుణ్యక్షేత్రానికి అన్ని విధాలుగా సహకారం అందిస్తామని, యోగాంధ్రలో భాగంగా ఒక రోజుని ఇక్కడ నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్‌కు కూడా సమాచారం అందించామన్నారు. దానికి జిల్లా కలెక్టర్ కూడా సానుకూలంగా స్పందించడం హర్షణీయమన్నారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని ఇదే గ్రౌండ్‌లో నిర్వహిస్తే, గ్రౌండ్ కూడా మనకు అనుకూలంగా కార్యాచరణ జరుపుకుంటుందన్నారు. క్రీడలు మానసికోల్లాసాన్నిస్తుందని, ఇందులో తనను కూడా భాగస్వామ్యున్ని చేసిన కమిటీ సభ్యులకు ధన్యవాదాలన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం కమిటీ సభ్యుల బృందం, గ్రామాధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు, స్థానికులు పాల్గొన్నారు.

విత్తనాలను పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

38 వేల క్వింటాళ్లు వరి విత్తనాలు సిద్ధం

వ్యవసాయశాఖ జెడి త్రినాథస్వామి

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

ఈ ఖరీఫ్‌లో వరి సాగు చేసే రైతులకు జిల్లాలో అన్ని రైతు సేవా కేంద్రాల్లో 38 వేల క్వింటాల వరి విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉంచామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి కె.త్రినాథస్వామి అన్నారు. మండలంలోని నిమ్మాడ రైతు సేవ కేంద్రంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరిప్రసాద్‌తో కలిసి రైతులకు విత్తనాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఇప్పటికే 38 వేల క్వింటాల వరి విత్తనాలు, 9వేల మెట్రిక్ టన్నుల యూరియా, డిఏపిలను అందుబాటులో ఉంచామని వ్యవసాయాధికారులు తెలిపారు. హరిప్రసాద్ మాట్లాడుతూ ఈ ఖరీఫ్‌లో రైతులకు విత్తనాలకు, ఎరువులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో విజిలెన్స్ విశ్రాంత ఎస్‌పి కింజరాపు ప్రభాకర్, టెక్కలి ఎడిఎ బి.వి.తిరుమలరావు, ఎఒ ఎస్.గోవిందరావు, ఎంపిటిసి పట్ల సింహాచలం, చౌదరి బాబ్జి పాల్గొన్నారు.

తాళ్లవలస రేషన్ డిపోను తనిఖీ చేస్తున్న తహశీల్దార్ రాజశేఖర్

వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దే రేషన్

ప్రజాశక్తి - లావేరు

రేషన్ డిపోల ద్వారా అందజేస్తున్న రేషన్ సరుకులు 65 ఏళ్ళు నిండిన వృద్ధులు, వికలాంగులకు డీలర్లే డోర్ డెలివరీ చేసి అందించాలని తహశీల్దార్ మంగం రాజశేఖర్ అన్నారు. మంగళవారం తాళ్లవలస రేషన్ డిపోను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కడా ఏవిధమైన ఆటంకాలు లేకుండా సరుకులు సక్రమంగా కార్డుదారులకు అందజేయడం జరుగుతుందని, ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్టు ఆయన చెప్పారు. 58 రేషన్ డిపోల్లో సరుకులు సక్రమంగా పంపిణీ జరుగుతుందన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ వృద్ధులు, వికలాంగులు రేషన్ డిపోలకు రాకుండా సరుకులు వారి ఇంటికే అందజేయడం జరుగుతుందని, డీలర్లు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా డీలర్ ముప్పిడి రమేష్‌ను పంపిణీ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

మలేరియా నిర్మూలనపై ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

పరిశుభ్రతతోనే మలేరియా నివారణ

ఆమదాలవలస: పరిసరాల పరిశుభ్రతతోనే మలేరియా వ్యాధిని నివారించవచ్చునని అక్కులపేట పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ వసంత అన్నారు. పిహెచ్‌సి పరిధిలో మలేరియా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ర్యాలీ నిర్వహించారు. మలేరియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటిచుట్టూ చెత్తా చెదారాలు, మురుగునీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందుతాయన్నారు. వర్షాకాలంలో దోమలు వృద్ధి చెంది ప్రజలు వ్యాధుల బారిన పడతారన్నారు. మలేరియా సీజనల్ వ్యాధుల నివారణకు కృషి చేస్తున్నామని, ప్రజలు కూడా సహకరించాలని కోరారు. ఇఒ జనార్ధన రావు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో విద్యార్థుల ఎంపిక

ఎంపికైన విద్యార్థులతో సంస్థ ప్రతినిధులు

శ్రీకాకుళం: ఇటీవల కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాలలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ క్యాంపస్ ఇంటర్వ్యూలను నిర్వహించింది. ఈ క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఆదిత్య డిగ్రీ కళాశాల కో-ఎడ్ క్యాంపస్ విద్యార్థులు 60 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎన్.వి.వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరం ఒక్క టిసిఎస్‌లో వివిధ విభాగాలకు శ్రీకాకుళం డిగ్రీ కళాశాలల నుంచి మొత్తం 150 మంది ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ కళాశాల సెక్రటరీ సుగుణా రెడ్డి మాట్లాడుతూ ఆదిత్య డిగ్రీ కళాశాల క్యాంపస్ ఇంటర్వ్యూలకు మారుపేరుగా మారిందని ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం ఇప్పటివరకు 17,140 ఉద్యోగాలతో అత్యుత్తమ రికార్డు నెలకొల్పామని తెలిపారు. కళాశాల అకాడమిక్ డైరెక్టర్ బి.ఇ.వి.ఎల్ నాయుడు మాట్లాడుతూ టిసిఎస్ సాఫ్ట్‌వేర్ వంటి ప్రముఖ కంపెనీలకు 60 మంది విద్యార్థులు ఒక బ్యాచ్ నుంచే ఎంపికవ్వడం హర్షనీయమని తెలిపారు. కళాశాల ఛైర్మన్ డా.ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్, బి.ఎస్.చక్రవర్తి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

సిండి'కేట్'గా దోచేస్తున్నారు

- మద్యం అమ్మకాలపై నియంత్రణ
- రూ.160 పైబడే అమ్మకాలు
- బెల్ట్ షాపులతో కుమ్మక్కు

ప్రజాశక్తి - కవిటి

తక్కువ ధరకే నికార్సైన మద్యం అందిస్తాం, బెల్టు షాపులు లేకుండా చేస్తాం అంటూ నాయకులు చెప్పిన మాటలు నీటి మూటలవుతున్నాయి. మొత్తంగా సిండికేటు' వ్యవహారం ఆధిపత్యంతో వారు చెప్పిందే రేటు.. వారు ఇచ్చిందే మందు అన్నతీరుగా మద్యం విక్రయాలు సాగుతున్నాయి. ఉదాహరణకు మంగళవారం కవిటి మండలంలో అన్ని మద్యం షాపుల్లో కూడా రూ.160ల కంటే తక్కువ రేటు ఉన్న మద్యం విక్రయించలేదు. ఏమని అక్కడ సిబ్బందిని అడిగితే తమపైన ఉన్నవారు చెప్పినట్టు తాము చేయాలని చెప్పారు. అంతేకాకుండా ఇకపై కూడా ఇలాగే ఉండొచ్చు అని తేల్చేశారు. దీంతో మందుబాబులు తప్పని సరి పరిస్థితుల్లో అదనపు డబ్బులు చెల్లించి మద్యం కొనుగోలు చేశారు. వాస్తవానికి గత రెండు వారాలుగా కవిటిలో ఉన్న మద్యం దుకాణాల్లో రూ.99ల మద్యం దొరకడం లేదు. అదే సమయంలో బెల్టు షాపుల్లో మాత్రం దొరుకుతోంది. జిల్లాలో అత్యధికంగా అమ్ముడయ్యే రూ.99 రకం మద్యం కవిటిలోనే కాకుండా జిల్లాలో కూడా దొరకడం కష్టంగా ఉందని మందు బాబులు చెబుతున్నారు. దీంతో చేసేది లేక తాము రూ.120వైపు మొగ్గు చూపితే ఇప్పుడిక అదికూడా ఇవ్వకపోవడతో రూ.160ది కొనాల్సి వస్తోందని మందుబాబులు వాపోతున్నారు.

'బెల్టు' బిగించేస్తున్నారు

బెల్ట్ షాపులు నడిపితే సహించేది లేదు కఠిన చర్యలు తీసుకుంటాం అంటూ అధికారులు, ప్రజాప్రతినిధులు పైకి చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు దానికి భిన్నంగా ఉన్నాయి. మద్యం దుకాణాలతో సిండికేట్ అయిన బెల్టు షాపులు మూడు గ్లాసులు ఆరు సీసాలుగా

మద్యం దుకాణం

వెలుగుతున్నాయి. కవిటి మండల కేంద్రంతో పాటు మత్స్యకార గ్రామాలు, సామంత గ్రామాల్లో బెల్టు షాపుల హవా కొనసాగుతోంది. ముఖ్యంగా మద్యం దుకాణాల్లో ఉన్న వారితో బెల్టు షాపు నిర్వాహకులు సమన్వయం చేసుకుంటూ చాపకింద నీరులా అమ్మకాలు సాగిస్తున్నారు. ఎంతలా అంటే బెల్టు షాపులకే నేరుగా మద్యం చేరేలా వ్యవహారం సాగుతోంది. ఇందులో విశేషం ఏమిటంటే మద్యం దుకాణాల్లో దొరకని రూ.120, రూ.130 రకాల మద్యం సీసాలు బెల్టు షాపుల్లో మాత్రం యథేచ్ఛగా దొరుకుతున్నాయి.

సంబరాలతో అదనపు ఆదాయం

గతంలో లా కాదు. మద్యం దుకాణాలతో ఏం ఆదాయం రావడం లేదు. నడిపించడమే కష్టంగా ఉంది అంటూ నిర్వాహకులు మొసలి కన్నీళ్లు కారుస్తున్నా వాస్తవాలు అందుకు భిన్నంగా ఉన్నాయి. కవిటి మండలంలో 4 షాపులు ఒక్కొకటి రోజుకు రూ.2.50 లక్షల ఆదాయానికి తగ్గడం లేదు. ముఖ్యంగా గ్రామాల్లో అమ్మవారి సంబరాలు నిర్వహిస్తున్నప్పుడు ఈ అంకె మరింత పెరుగుతోంది. ఇచ్ఛాపురం మండలంలో 7 మద్యం దుకాణాలు ఉంటే... వాటిలో 4 దుకాణాల్లో రోజుకు రూ.2.5 లక్షల వరకూ అమ్మకాలు సాగుతున్నాయి. మిగతా 3 దుకాణాల్లో కొంత మందకొండిగా విక్రయాలు ఉన్నట్టు తెలుస్తోంది. సోంపేట మండల కేంద్రంలో ఉన్న 4 షాపుల్లో మూడు షాపులు రూ.2.50 నుంచి రూ.3 లక్షల వరకు అమ్మకాలు ఉంటే అందులో కొత్తగా వచ్చిన సొండీల దుకాణంలో మాత్రం రూ.1.20 నుంచి 1.80 వరకు అమ్మకాలు సాగుతున్నాయి. ఇక మండలంలోని మిగతా 3 షాపులు సుమారు రూ.3 లక్షల వరకూ అమ్మకాలు సాగుతున్నాయి. సోంపేట సమీపంలోని ఓ గ్రామంలో ఇటీవల నిర్వహించిన సంబరాలు సందర్భంగా ఒక్కరోజే రూ.6 లక్షల అమ్మకాలు సాగడం విశేషం. కంచిలి మండలంలో ఉన్న 3 దుకాణాల్లో సంబరాల సందర్భంగా 2.50 నుంచి 3 లక్షల, మామూలు సమయంలో 1,80 లక్షల నుంచి 2 లక్షలు విక్రయాలు సాగుతున్నాయి. మొత్తంగా ఏ దుకాణం కూడా రూ.2 లక్షలకు తగ్గడం లేదు. ఇక కంచిలిలో సంబరాల సందర్భంగా రోజుకి రూ.5 లక్షల వరకూ అమ్మకాలు చేరుకోవచ్చని అంచనా.

అంతా తానై...

మద్యం సిండికేట్ వ్యవహారాల్లో కవిటి మండలంలోని ఓ వ్యక్తి అంతా తానై వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది. రేట్లు పెంచాలన్నా, తగ్గించాలన్నా, ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు చూపించగల సామర్థ్యం ఆయన సొంతమని చర్చ. బెల్టు షాపుల వ్యవహారం కూడా ఆయన కనుసన్నల్లోనే నడుస్తోందని, ఆయనకి అనుకూలంగా లేని బెల్టు షాపులపై ఎక్సైజ్ దాడులు జరిగి సందర్భాలు కూడా ఉన్నాయంటే ఆశ్చర్యపోనక్కర్లేదు. ప్రస్తుతం రూ.160ల లోపు మందు సీసాలతో తమకు లాభం లేదని, అందుకే వాటి అమ్మకాలు నియంత్రించాలనే ప్రతిపాదన, అమలు సదరు పెద్ద మనిషి చలవేనని తెలుస్తోంది.

కొరవడుతున్న పర్యవేక్షణ

మరోవైపు మద్యం అమ్మకాలపై పర్యవేక్షణ లేకపోవడమే దీనంతటికీ కారణంగా తెలుస్తోంది. కేవలం ఎస్‌పి టీమ్ తప్పించి మిగతా ఎక్సైజ్, మొబైల్ బృందాలు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండటం, తూతూ మంత్రంగా తనిఖీలు చేస్తుండడంతో వీరికి అడ్డేలేకపోతోంది. దీంతో అటు ధరల నియంత్రణలో కానీ, మద్యం విక్రయాలపై కానీ, బెల్టు షాపుల నిర్వహణపై కానీ నియంత్రణ లేక సిండికేట్ వ్యవహారం మూడు గ్లాసులు ఆరు సీసాలుగా సాగుతోంది.

రూ.99 సప్లై తక్కువగా ఉంది

వాస్తవానికి రూ.99 రకం మద్యం సరఫరా తక్కువగా వస్తోంది. దీంతో కొంత సమస్య ఏర్పడుతోంది. కానీ రూ.120ల నుంచి మిగతా అన్ని రకాల మద్యం లభిస్తోంది. వీటి విక్రయాలు జరగడం లేదనే విషయంపై దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటాం.

- పి.దుర్గాప్రసాద్, ఎక్సైజ్ సిఐ, ఇచ్ఛాపురం

కూలీ మొత్తం మందుకే

నేను కూలికి వెళ్తే వచ్చేది రూ.300లు. పది రోజుల క్రితం వరకూ రూ.99ల మద్యం సీసాతో గడిపేవాడిని. అవి రాకపోవడంతో రూ.120ల సీసా కొనాల్సివచ్చేది. ఇప్పుడు అదీ లేదు. రూ.160ది మాత్రమే ఇస్తామని అంటున్నారు. ఇప్పుడు నాలాంటివాడి పరిస్థితి ఏంటి. ఇంటికి ఏమివ్వాలి, మద్యం ఎలా కొనాలి. ప్రభుత్వం సరఫరా చేస్తున్నా మధ్యలో నాటకాలు చేస్తున్నారు. ఇది సరికాదు.

- యాండ్రాపు లక్ష్మణమూర్తి, మందుబాబు

వెన్నుపోటుకు ప్రతిరూపమే జగన్

ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి - పొందూరు

అధికార దాహం, డబ్బు కోసం తల్లి, చెల్లి, బాబాయి అనే భేదం లేకుండా వెన్నుపోటు పొడిచిన జగన్‌మోహన్‌రెడ్డి వెన్నుపోటుకు ప్రతిరూపమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. తన ఎదుగుదలకు కారణమైన కాంగ్రెస్‌ను, అధికారం కోసం బాబాయిని కత్తిపోట్లుకు గురిచేసి, ఆస్తికోసం తల్లిని, చెల్లిని రోడ్డుపైకి తీసుకువచ్చిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని విమర్శించారు. రాష్ట్ర ప్రజలకు నరకాసుర పాలన నుంచి విముక్తి కలిగి, వైసిపికి సమాది కట్టి ఏడాది అవుతుందన్నారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు చేయాల్సింది వెన్నుపోటు దినం కాదని, ప్రథమ వర్ధంతిని చేసుకోవాలన్నారు.

సమన్వయంతో గ్రామ పండుగ జరపాలి

మేజర్ పంచాయతీలో నిర్వహించనున్న గ్రామ

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

పండుగను వివిధ శాఖల అధికారులు, పండుగ నిర్వాహణ కమిటీ సభ్యులు సమన్వయంతో ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే అన్నారు. ఈనెల 15 నుంచి నిర్వహించనున్న పండుగను విజయవంతం చేయాలని సూచించారు. పోలీస్, విద్యుత్‌శాఖ, పంచాయతీ అధికారులు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని సిఐ సత్యనారాయణకు సూచించారు.

నాడు-నేడు పనులపై సమీక్ష

నాడు-నేడు పనులపై ఎంఇఒలు, హెచ్‌ఎంలు, ఇంజినీరింగ్ అధికారులతో మండల పరిషత్ కార్యాలయంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మండలంలో నాడు-నేడు పనులకు సంబంధించి పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అత్యంత అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. ఈ సమావేశానికి ఆ పాఠశాల హెచ్‌ఎం పి.వెంకటరావు గైర్హాజరుపై మండిపడ్డారు. ఉన్నత పాఠశాలలో జరిగిన నాడు-నేడు పనులు, పిఎంసి పనులపై పూర్తిస్థాయి నివేదికను అందించాలని ఎంఇఒలు, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు చిగిలిపల్లి రామ్మోహన్, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కూన వెంకట సత్యనారాయణ, మాజీ ఎఎంసీ ఛైర్మన్ అన్నెపు రాము, టిడిపి పట్టణ అధ్యక్షుడు ఎ.చిన్నరంగా, టిడిపి నాయకులు సీపాన శ్రీరంగ నాయకులు, బలగ శంకర భాస్కరరావు, బాడాన శేషగిరి, చింతాడ కృష్ణవాసుదేవరావు, మొదలవలస సీతారామారావు, సువ్వారి మధు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయశాఖ అధికారులను నిలదీస్తున్న సాయికృష్ణ

తీర్మానాలు వైసిపివి... పథకాలు అధికార పార్టీకా?

పలాస: అభివృద్ధి పనులకు పంచాయతీ, మండల తీర్మానం చేస్తుంటే... ప్రభుత్వ పథకాలు అధికార పార్టీ నాయకులకు కట్టబెట్టడం ఎంత వరకు సమంజసమని మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉంగ సాయికృష్ణ అధికారులను ప్రశ్నించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఉంగ ప్రవీణ అధ్యక్షతన మంగళవారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు వస్తున్న సమయంలో స్థానిక పంచాయతీ సర్పంచ్, ఎంపిటిసిల సిఫార్సు చేసిన వారికి ఇవ్వకుండా అధికార పార్టీకి చెందిన వ్యక్తులకే కేటాయించడం సరైన పద్ధతి కాదన్నారు. ఇక నుంచి కొంత శాంతమైన తమకు సంబంధించిన వ్యక్తులకు కేటాహించకపోతే తీర్మానం ఇవ్వడం కుదరదన్నారు. ఉపాధి హామీ కింద గోశాలలు నిజమైన లబ్ధిదారులకు ఇచ్చారా? అంటూ ఎపిఒ శంకరరావును ప్రశ్నించారు. అన్నదాతకు అండగా ఉంటామని చెబుతున్న కూటమి ప్రభుత్వం రైతుల నుంచి పూర్తిస్థాయిలో ధాన్యాన్ని ఎందుకు కొనుగోలు చేయలేదని వ్యవసాయ శాఖ ఎఒ పోలారావును నిలదీశారు. చివరకు రైతులు తమ ధాన్యాన్ని వ్యాపారులు, దళారులకు ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతేడాది అన్నదాత సుఖీభవ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. వంశధార పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయడం సంతోషమే కానీ కాలువ ఉపయోగపడే పనులు చేపట్టడం ద్వారా శివారు భూములకు సాగునీరు అందే అవకాశం ఉందని ఆ దిశగా ప్రతిపాదనలు ఎందుకు చేయలేదని వంశధార ఎఇ మీనాక్షిను నిలదీశారు. బొడ్డపాడు సర్పంచ్ తామడ మధన్ మాట్లాడుతూ రేషన్ సరుకులు ఇవ్వాలని, అడుగుతుంటే డీలర్ ఇక్కడ రేషన్ ఇవ్వడం కుదరదని చెబుతున్నారని, లబ్ధిదారులకు రేషన్ సక్రమంగా అందేలా చూడాలని కోరారు. చినంచల ఎంపిటిసి బమ్మిడి దుర్యోధన మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో నిరంతరం అంతరాయం కలుగుతోందని, ఇష్టానుసారంగా బిల్లులు వస్తుండడంతో వినియోగదారులు బిల్లులు చెల్లించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విద్యుత్ శాఖ ఎఇ వివేకానందను నిలదీశారు. విద్యాశాఖకు సంబంధించిన పథకాల కోసం మండల విద్యాశాఖాధికారి సిహెచ్.శ్రీనివాసరావు వివరిస్తుండగా ఎంపిటిసి బమ్మిడి దుర్యోధన స్పందిస్తూ గత ప్రభుత్వంలో ఉన్న పథకాల్ని పేర్లు మార్చి పెడుతున్నారే తప్ప అదనంగా ఏమైనా పెట్టరా లేదు కదా? అని ప్రశ్నించారు. సమావేశంలో ఎంపిడిఒ వసంతకుమార్, మండల ప్రత్యేకాధికారి పోతనపల్లి చంద్రశేఖర్, డిప్యూటీ ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు, వైస్ ఎంపిపి సవర దాలమ్మ పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వృద్ధుడు దుర్మరణం

ఉపేంద్ర (ఫైల్)

పలాస: ఆర్‌టిసి బస్సు ఢీకొని మండలంలోని సున్నాడకు చెందిన కుమ్మరి ఉపేంద్ర (63) మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉపేంద్ర మంగళవారం సైకిల్‌పై తమ ఇంటి విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు పలాస విద్యుత్ కార్యాలయానికి వచ్చాడు. బిల్లు చెల్లించి తిరిగి ఇంటికి వెళ్ళుతున్న సమయంలో ఆర్‌టిసి బస్సు వెనుక భాగం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. మృతుడి భార్య ఏడాది క్రితం మృతి చెందింది. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాశీబుగ్గ సిఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుకు వ్యక్తి మృతి

ఎచ్చెర్ల: మండల పరిధిలో హరిణం అక్కివలస గ్రామ సమీపంలో లావేరు మండలం బుడుమూరుకు చెందిన కొలుసు గోపి (38) మంగళవారం సాయంత్రం పాము కాటు గురై మృతి చెందాడు. గోపి తాటికల్లు తీసేందుకు చెట్టు ఎక్కి దిగుతుండగా పాము కాటు వేసింది. దీంతో ఆ వ్యక్తిని కుటుంబసభ్యులు శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య దేవి, కుమారుడు ఉన్నారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎన్.కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గంజాయితో పట్టుబడిన నిందితులు

గంజాయితో ఇద్దరు అరెస్టు

ఇచ్ఛాపురం: ఒడిశా రాష్ట్రం నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టణ పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి నాలుగు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని సిఐ మీసాల చిన్నంనాయడు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిందితులను మంగళవారం విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీహార్ రాష్ట్రానికి చెందిన షేకావత్ తన కుటుంబంతో గుజరాత్ రాష్ట్రంలో వాపి పట్టణంలో నివసిస్తున్న సమయంలో, తన బావమరిదితో మాట్లాడే సమయంలో, అర్జద్ ఒడిశాకు చెందిన దల బెహరా చిత్రసేన్ అతని వద్ద నుంచి గంజాయి కొని ఎక్కువ రేటుకు అమ్ముతున్నాడని అన్నారు. దానివల్ల ఎక్కువ డబ్బులు సంపాదిస్తున్నట్లు చెప్పినట్లు, తరువాత తన బావమరిది ద్వారా చిత్రసేన్ పరిచయమైనట్లు, తరువాత తన కుటుంబ పరిస్థితి బాగులేకపోవడంతో గంజాయి వ్యాపారం చేద్దామని నిర్ణయానికి వచ్చారని అన్నారు. చిత్రసేన్‌కు ఫోన్ ద్వారా తనకు గంజాయి కావాలని చెప్పగా, చిత్రసేన గంజాయి కోసం బరంపురం రమ్మని చెప్పారని తెలిపారు. తాను బరంపురం వచ్చినట్లు, తరువాత షేకావత్ చిత్రసేన్ వద్ద రూ.20 వేలుకు నాలుగు కేజీల గంజాయిని కొని ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కుతుండగా... పట్టుకున్నట్లు తెలిపారు. ఇద్దరినీ అరెస్టు చేసి వారి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. సమావేశంలో టౌన్ ఎస్ఐ ముకుందరావు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

సరుబుజ్జిలి: మండలంలోని పురుషోత్తపురం ఇసుక ర్యాంపు వద్ద నుంచి అనధికారికంగా ఇసుకను తీసుకు వెళ్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహశీల్దార్ ఎల్.మధుసూదనరావు, ఎస్ఐ హైమావతి తెలిపారు. ఉచిత ఇసుక గడువు మే 31తో ముగిసిందని, డీసిల్టేషన్ ప్రదేశాల్లో మాత్రమే ఇసుక తరలించడానికి అనుమతులు ఉన్నాయని తహశీల్దార్ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

కొత్తూరు: మండలంలోని బలదలో మాధవహరి ఇంటి వరండాలో అక్రమంగా నిల్వ ఉన్న 48 రేషన్ బియ్యం బస్తాలను స్థానికులు ఫిర్యాదు మేరకు విజిలెన్స్, రెవెన్యూ అధికారులు మంగళవారం దాడి చేసి పట్టుకున్నారు. పట్టుకున్న బియ్యం 2400 కేజీలను సరుబుజ్జిలి ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించినట్లు తెలిపారు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆర్ఐ లక్ష్మణరావు తెలిపారు. వీరితోపాటు వి.ఆర్ఒ రాజగోపాలరావు ఉన్నారు.

పట్టుబడిన రేషన్ బియ్యం

డ్రైనేజీలు ఏర్పాటు చేయాలి

శ్రీకాకుళం సిటీ: శ్రీకాకుళం నగర పాలక సంస్థ విలీన గ్రామాల్లో డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని పట్టణ పౌర సంక్షేమ వేదిక మంగళవారం డిమాండ్ చేసింది. వేదిక కన్వీనర్ ఎం.గోవర్ధనరావు మాట్లాడారు. ప్రకృతి విపత్తులు శాఖ ఈ ఏడాది 137 శాతం వర్షాలకు అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో డ్రైనేజీలు ఏర్పాటు అవసరమన్నారు. పట్టణంలో కాలనీల్లో సైతం వరద నీరు నిలిచిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అధికా రులు ప్రత్యేక చర్యలు తీసుకొని సమస్య పరిష్కరించాలన్నారు.

మాట్లాడుతున్న జడ్జి రోహిణి

చట్టాలపై అవగాహన

కోటబొమ్మాళి: మహిళలు వారి కోసం రూపొందించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్ ఎం.రోషిణి తెలిపారు. స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదులు, ప్యానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్స్‌లతో మంగళవారం మాట్లాడారు. లైంగిక వేధింపుల నివారణ చట్టం ప్రకారం ప్రభుత్వ, లేదా ప్రయివేట్ సంస్థలో మహిళలపై ఎటువంటి లైంగిక వేధింపులు జరిగినా తక్షణమే పిర్యాదు చేయాలని సూచించారు. సదస్సులో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు ఎల్.శ్రీనివాసులు, ఎపిసి ఆర్.శాంతి, సంతోషి, ఎస్.తిరుపతి, న్యాయవాదులు పల్లి వాసుదేవరావు, వెంకటరావు పాల్గొన్నారు.

నేడు ఏడాది పండగ

శ్రీకాకుళం సిటీ: కూటమి పాలన ఏడాది పూర్తయిన నేపథ్యంలో బుధవారం ఉదయం 9 గంటలకు జనసేన పార్టీ వీరమహిళలతో రంగవల్లులు (ముగ్గులు) వేసి కూటమి ప్రభుత్వ విజయాన్ని పండుగ చేద్దామని జనసేన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ ఒక ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వం పీడ విరగడై ఏడాది పేరుతో శ్రీకాకుళం ఏడురోడ్ల కూడలిలో సాయంత్రం 5 గంటలకు దీపాలు వెలిగించి, టపాకాయలు కాల్చి దీపావళి చేసుకుందామని పిలుపునిచ్చారు.

వృద్ధురాలికి పింఛను అందజేత

బూర్జ: మండలంలోని కొరగాం పంచాయతీకి చెందిన వృద్ధురాలు బెవర జయమ్మ అనారోగ్య కారణాల వల్ల హైదరాబాద్ ఆస్పత్రిలో ఉండగా, ఎన్‌టిఆర్ భరోసా పింఛను మొత్తం మూడు నెలలకు రూ.12 వేలు కొరగాం కార్యదర్శి ఎం. రోహిణి వ్యక్తిగతంగా హైదరాబాద్ వెళ్లి ఆ మొత్తాన్ని ఆమెకు స్వయంగా అందజేశారు.

శిక్షణలో మాట్లాడుతున్న డిఇఒ తిరుమల చైతన్య

విద్యా విధానంలో మార్పులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఎన్‌సిఆర్‌టి నిబంధనల మేరకు విద్యలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టనున్నట్లు డిఇఒ తిరుమల చైతన్య అన్నారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో మంగళవారం అకడమిక్ క్యాలెండర్, టీచర్ హ్యాండ్ బుక్, అసెస్మెంట్ బుక్స్‌లోని మార్పులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి సబ్జెక్టు నుంచి 24 మంది డిఆర్‌పిలను ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. రానున్న విద్యా సంవత్సరంలో మారనున్న అకడమిక్ అంశాలపై హైస్కూల్ ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులందరూ పూర్తి అవగాహనతో ఉండాలన్నారు. టీచర్ హ్యాండ్ బుక్, అసెస్మెంట్ బుక్, కరిక్యులంలోని మార్పులపై అవగాహన అవసరంగా చెప్పారు. తరగతులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్, ఉప విద్యాశాఖ అధికారి ఆర్.విజయ్ కుమారి, టెక్కలి, పలాస ఉప విద్యాశాఖ అధికారి పి.విలియం, డిసిఇబి సెక్రెటరీ రాజేంద్రప్రసాద్, డైట్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ గౌరీ శంకర్, స్టేట్ అబ్జర్వర్ గిరిజా శంకర్, డైట్ వమ్మరవల్లి అధ్యాపకులు, ఎస్ఆర్‌పిలతో పాటు డిఆర్‌పిలు పాల్గొన్నారు.

వికసిత కృషి సంకల్ప అభియాన్‌పై అవగాహన

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

ప్రకృతి వ్యవసాయంపై కేశవరావుపేటలో వికసిత కృషి సంకల్ప అభియాన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాగోలు పరిశోధన శాస్త్రవేత్త ఉదయ్ కుమార్ మాట్లాడుతూ మేలైన రకాలు సాగుచేసుకోవాలని సూచించారు. శాస్త్రవేత్త డాక్టర్ హేమ మాట్లాడుతూ కూరగాయల సాగు విధానం, స్టోరేజ్ చేసే విధానం, ఉత్పత్తుల కోసం వివరించారు. కెవికె శాస్త్రవేత్త సునీత మాట్లాడుతూ ఉద్యాన పంటలు, నారు పెంపకం, కోళ్ల పెంపకం, పుట్టగొడుగులు పెంపకంపై వివరించారు. స్థానిక సర్పంచ్ భాస్కరరావు మాట్లాడుతూ వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే శాస్త్రవేత్తల నుంచి సలహాలు, సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి వ్యవసాయ అధికారి దుర్గాప్రసాద్, మాజీ సర్పంచ్ భీమారావు, ఎంపిటిసి జగదీష్, జనసేన నాయకులు శ్రీనివాస్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బూర్జ: మండలం పరిధిలోని మామిడివలసలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కృషి విజ్ఞాన

ఎచ్చెర్ల : రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శైలజ ఖరీఫ్ పంట కాలాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు పాటించాల్సిన ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో కేంద్రీయ పరిశోధన రైతులతో ముఖాముఖి చర్చలు జరిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.అనూష, వ్యవసాయ విస్తరణ అధికారి సాయితేజ, గ్రామపెద్దలు జి. రమణమూర్తి, జి.రమేష్, కె.సూర్యనారాయణ, గోవింద సాహు, వెంకట సూర్యం తదితరులు పాల్గొన్నారు.

ఏర్పడిన గొయ్యి

ఆదమరిస్తే అంతే...

పోలాకి: మండలంలోని డోల-పోలాకి గ్రామాల మధ్య ఉన్న ప్రధాన రోడ్డులో వంతెన వద్ద ఏర్పడిన గొయ్యి వల్ల ప్రయాణికులకు భయానికంగా ఉంది. ఆ రహదారిలో అదమరిస్తే వాహనాలు నడిపితే అంతిమ లోకానికే అని ప్రయాణికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి వేసి తక్కువ రోజులు అయినా... నాణ్యత నాన్యత లోపించడం వల్ల పెద్ద గొయ్యి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డులో పోలాకి నుంచి డోల, గోవిందపురం, తలసముద్రం, దుబ్బకవానిపేట, జొన్నాం, మబగాం, గజపతినగరం, కత్తిరివానిపేట, జనావానిపేట తదితర గ్రామాలకు చెందిన ప్రజలు ప్రయాణం చేస్తుంటారు. రాత్రి సమయంలో వెళ్లాలంటే ప్రమాదం సంభవిస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ గోతులను పూడ్చి బాగు చేయాలని పలువురు కోరుతున్నారు.

'వెన్నుపోటు'ను విజయవంతం చేయాలి

వైసిపి జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం సిటీ: వైసిపి రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపులో భాగంగా 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని శాంతియుతంగా నిర్వహించి ప్రజల ఆవేదనను ప్రభుత్వానికి తెలియ జేయాలని వైసిపి జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త సన్నద్ధంగా ఉండాలన్నారు. ఏదొగా ప్రజలు గుర్తైన వెన్నుపోటు స్పష్టంగా చెప్పాలని చెప్పారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో బుధవారం ర్యాలీలు నిర్వహించి ప్రభుత్వ అధికారులకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఎక్కడైనా అడ్డంకులు కల్పించే యత్నం జరిగినా, వాటిని న్యాయపరంగా ఎదుర్కొంటామని, అవసరమైతే మీడియా ఎదుట వివరించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వంపై ఉన్న ప్రజా వ్యతిరేకత స్పష్టంగా బయటపడేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమం ఘర్షణల కోసం కాదని, ప్రజల మనోవేదనను ప్రభుత్వానికి తెలియజేసే శాంతియుత ఉద్యమంగా నిర్వహించనున్నట్లు కృష్ణదాస్ తెలిపారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రెడ్డి శాంతి

'వెన్నుపోటు' పోస్టర్ ఆవిష్కరణ

మెళియాపుట్టి: మెళియాపుట్టి మండల కేంద్రంలోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద మంగళవారం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి 'వెన్నుపోటు' పోస్టర్‌ను ఆవిష్కరించారు. బుధవారం ఉదయం 10 గంటలకు పాతపట్నం పంచాయతీ కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. వైసిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి రానా ఈశ్వరమ్మ, ఎంపిపి ప్రతినిధి బైపోతు ఉదయ్‌కుమార్, వైస్ ఎంపిపి సవర ఆదినాయుడు, మండల కన్వీనర్ పోలాకి జైమునిరావు, కరణం శశిభూషణరావు, సంజీవరావు, శ్యామల జన్న, మాడుగుల మణి పాల్గొన్నారు.

పలాస : వైఎస్ఆర్ కూడలి వద్ద బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న 'వెన్నుపోటు' ర్యాలీని విజయవంతం చేయాలని పట్టణ వైసిపి అధ్యక్షులు శిష్టు గోపి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో పట్టణ వైస్ చైర్మన్ బోర కృష్ణారావు, మున్సిపల్ విప్ కౌన్సిలర్ శంకర్ పండా, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ

పోలాకి : ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కావడంతో వ్యవసాయాధికారులు ఎల్లవేళలా రైతులకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. పోలాకి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం రైతులకు వరి విత్తనాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రాయితీపై నాణ్యమైన వరి విత్తనాలు అందించాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భైరి భాస్కరరావు, సూరపు నారాయణదాస్, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సాగు.. భారం కాకూడదు

ప్రజాశక్తి- నరసన్నపేట

రైతులకు ఎప్పుడు సాగు భారం కాకూడదని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ హరికుమార్ అన్నారు. మండలంలోని గోపాలపెంటలో కృషి విజ్ఞాన కేంద్రం, ఉద్యానవనశాఖ, వ్యవసాయశాఖ సంయుక్తంగా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కి రైతులు సన్నద్ధం కావాలని సూచించారు. అలాగే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు వచ్చే తోట పంటలపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయం, రైతులు పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో పర్యావరణ దినోత్సవం

శ్రీకాకుళం లీగల్: ఈ నెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగానుదయం 9.30 గంటలకు జిల్లా కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఒక ప్రకటన విడుదల చేసింది. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా అధ్యక్షతన నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు జిల్లా జడ్జీలు, పిఎల్‌పిఎస్ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జిలు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు, ప్రభుత్వ పరాధీన న్యాయవాది, ప్రాసిక్యూషన్ డిప్యూటీ డైరెక్టర్, పబ్లిక్ రిలేషన్ అధికారి పాల్గొనున్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై మొక్కలు నాటడం ద్వారా స్వచ్ఛమైన పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించి, భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలనేది ప్రధాన లక్ష్యమన్నారు.

70 శాతం హామీలు నెరవేర్చాం

పాతపట్నం: వెన్నుపోటు, గొడ్డలి వేటు పేటెంట్ రైట్స్ మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డిదేనని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిలో 70 శాతం హామీలు నెరవేర్చామని తెలిపారు. ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై మరింత విశ్వాసం పెరగనుండడంతో ఓర్వలేని జగన్ రెడ్డి విషం కక్కడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. వైసిపి పాలనలో ఒక్క రహదారినీ పూర్తి చేయలేదన్నారు. ఆస్తికోసం కన్నతల్లిని, చెల్లిని వెన్నుపోటు పొడిచే ఘనుడు జగన్ అని అన్నారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షుడు పైల బాబ్జి, చెన్నయ్య, భుజంగరావు పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వెంకటేష్

సైబర్ నేరాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- ఆమదాలవలస

సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) అన్నారు. మంగళవారం మండలంలోని జొన్నవలసలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో ఎన్ఎస్‌టి (సోషల్ సొసైటీ ట్రాన్స్‌ఫర్మేషన్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పొదుపు ప్రాముఖ్యతను తెలుసుకొని పొదుపు చేయాలన్నారు. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని ఎవరైనా ఫోన్ చేసి ఎటిఎం పిన్ కార్డు, బ్యాంకు అకౌంటు వివరాలను అడిగితే చెప్పవద్దని సూచించారు. ఎటిఎం కార్డు వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. అలాగే నగదు రహిత లావాదేవీలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవన్ జ్యోతి యోజన, సురక్షా బీమా యోజన పథకం కోసం వివరించారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మెన్ టోల్ ఫ్రీ నెంబర్ 14448 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ ఎఫ్ఎల్‌సి సువ్వారి రవిబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ గురుగుబెల్లి లక్ష్మి కుమారి, సిఎఫ్ఎల్ సిబ్బంది బొడ్డేపల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తీరమే ఆసనమైన వేళ...

ప్రజాశక్తి- కవిటి

తూర్పు గగనాన్ని తాకే అరుణోదయపు కాంతులు సముద్రపు అలలపై ప్రతిఫలిస్తుండగా కవిటి మండలం కొత్తపాలెం తీరంలో ఓ అరుదైన దృశ్యం అద్భుతంగా ఆవిష్కృతమైంది. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ శాఖల సిబ్బంది తీరాన్ని ఆసనస్థలంగా మార్చుకున్నారు. కేవలం వ్యాయామంగా కాకుండా, యోగా ఒక ఆధ్యాత్మిక సాధనగా మారుతున్న ఈ కాలంలో ఈ శిబిరం ఒక చైతన్య స్రవంతిలా మారింది. అక్కడ ఉన్న ప్రతి శ్వాసలో మౌనం, ప్రతి ఊపిరిలో ఓ శాంతి దృశ్యమైంది. నిత్యం ఫైళ్ల మధ్య నలిగిపోయే అధికారులు, పరుగుల మధ్య అలసిపోయే ఆశా వర్కర్లు, బాధ్యతల బరువుతో నిస్పృహ చెందిన పంచాయతీ ఉద్యోగులు... ఒక్కసారి ఆ మాండలిక తీరాన్ని తలచుకొని ఆ హాయిగా ఊపిరి పీల్చుకున్నారు. ఈ శిబిరం వల్ల ఎవరి జీవితాలు ఒక్కసారిగా మారిపోతాయో చెప్పలేము కానీ ఆ రోజంతా గుండెల్లో ఒక ప్రశాంత గంధం దాచుకున్నామంటే చాలుకదా? ఇప్పుడే ఎక్కడో చదివిన ఓ మాట గుర్తొస్తోంది. 'ప్రకృతిలో ప్రతి శ్వాసకూ ఒక సంగీతం ఉంది. మనం ఆగితేనే అది వినిపిస్తుంది'. నేడు కొత్తపాలెం తీరంపై ఆ సంగీతం వినిపించింది. ఆసనంలో కూర్చున్న ప్రతి మనిషిలో ఆ మౌనం నిండి పోయింది. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ మాట్లాడుతూ యోగా ఎప్పుడూ మనిషిని తనలోకి తానే చూసుకునే అద్దంగా నిలుస్తుందని అన్నారు.

తీరంలో యోగా శిబిరం

ఇచ్ఛాపురం : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తహశీల్దార్ వెంకటరావు, ఎంపిడిఒ రామారావు అన్నారు. యోగాంధ్రా కార్యక్రమంలో భాగంగా తీర ప్రాంత డొంకూరులో సామూహిక యోగాసనాలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాడి సహదేవ్ రెడ్డి, దున్నా లోకేశ్వరరావు, ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి నాగరాణి పాల్గొన్నారు.

ఉద్దానం ఆత్మీయతకు ముగ్ధుడినయ్యా

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఉద్దానం ప్రాంతంలో ప్రజలు ఐక్యతా, సోదరభావ ఆత్మీయతకు తాను ముగ్ధుడినయ్యానని ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర బిలాయి ఎమ్మెల్యే, బీహార్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి, ఎఐసిసి కార్యదర్శి దేవేంద్రయాదవ్ అన్నారు. వజ్రపుకొత్తూరు మండలం మెట్టూరులో మంగళవారం నిర్వహించిన కొండమహంకాళి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ప్రజలతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. జిల్లా వాసులు ప్రపంచంలో ఎక్కడైనా జీవించగలరని అన్నారు. కష్టపడి అభివృద్ధి చెందే సత్తా జిల్లా ప్రజలకు ఉందన్నారు. ప్రస్తుతం రాజకీయాల కోసం మాట్లాడానికి తాను రాలేదన్నారు.

సన్మానిస్తున్న గ్రామస్తులు

కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు దువ్వాడ హేమబాబు చౌదరి, మాజీ వైస్ ఎంపిపి జె.జె.రావు, ఎంపిటిసి సురేశ్, లక్ష్మీపతి, మల్లా రవికుమార్, జి.రాజు, చిరంజీవి, కామరాజు, నాగమణి పాల్గొన్నారు.

యోగా తైల వర్ణ చిత్రాల ఫొటోల ప్రదర్శన

లావేరు: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో యోగా తైలవర్ణ చిత్రాలు ప్రదర్శించారు. యోగాలో 96 యోగాసనాలు వాటి వినియోగంపై గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు విద్యార్థులకు తెలియజేశారు. 35 రోజుల వేసవి విజ్ఞాన శిబిరంలో సుమారు 40 మంది విద్యార్థులు 30 ఆసనాలను పూర్తిస్థాయిలో నేర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గ్రంథాలయంలో 100 మంది విద్యార్థులతో యోగా ప్రదర్శన నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. యోగా శిక్షకులు కోరాడ వాసుదేవరావు, పప్పు మల్లేశ్వరరావు, గ్రంథాలయ సహాయకులు టి. వీరభద్రుడు విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సిరిమాను

శ్రీకాకుళం సిటీ: శ్రీకాకుళం నగరంలో నిర్వహిస్తున్న పోలుమూరు వారి సిరిమాను సంబరాలు కొనసాగుతున్నాయి. గత నెల 6 నుంచి ఈ నెల 10 వరకు ఈ పండగలు కొనసాగ నున్నాయి. శ్రీ పెద్దమ్మ తల్లి, శ్రీ సన్నాల పోలమ్మ తల్లి, శ్రీనూకాలమ్మ తల్లి, శ్రీముత్యాలమ్మ తల్లి, శ్రీ దుర్గమ్మ తల్లులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అమ్మవార్లను నక్క వీధి, దండి వీధి, మా ఊరు వీధి, కలెక్టర్ బంగ్లా వీధి, కొత్తపేట, కునుకుపేట గ్రామాల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా కత్తిసాము, కర్రసాము, ఆర్కెస్ట్రా ప్రదర్శనలు చేశారు. ఈ ఊరేగింపులో పోలుమూరు వారి ప్రతినిధులు రామకృష్ణ, అచ్యుతరావు, జగదీశ్వరావు, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్న వితరణ

ఆమదాలవలస: కృతిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యాభై మందికి అన్నప్రసాద వితరణ చేశారు. మంగళవారం పురపాలక సంఘంలోని మెట్టక్కివలసలో నివాసం ఉంటున్న కొల్లి అనీల్, సుగుణ దంపతుల కుమార్తె తోషిక జన్మదినం సందర్భంగా పురపాలక సంఘంలోని 8వ వార్డు పరిధిలోని లెప్రసీ కాలనీలోని అనాథలు, వృద్ధులు, వికలాంగులకు అన్న వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కృతిక్ ఫౌండేషన్ చైర్మన్ చిగురుపల్లి చిన్ను మాట్లాడుతూ సామాజిక కార్యక్రమాలతోనే సంతృప్తి కలుగుతుందన్నారు. అన్న వితరణ కార్యక్రమానికి ఆర్థిక సహాయం అందించిన కొల్లి అనీల్ దంపతులకు ధన్యవాదములు తెలిపారు. పలువురు యువకులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

పాతపట్నం : మండలంలోని ప్రభుత్వం నూతన రేషన్ విధానాన్ని అమలు చేసిన రేషన్ డిపోల వద్ద ప్రజలు నిత్యవసర సరుకులు తీసుకోవాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక రేషన్ డిపో వద్ద అర్హులైన తెల్ల రేషన్ కార్డుదారులకు మంగళవారం నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ వృద్ధులకు, వికలాంగులకు ఇళ్ల వద్దకే వెళ్లి సరుకులు తీసుకుని వెళ్లి ఇవ్వాలన్నారు. ప్రభుత్వ నిర్ణయించిన సమయంలో రేషన్ డిపోల వద్ద సరుకులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయి డిటి ప్రసాదరావు, మండల స్పెషల్ ఆఫీసర్ మంచి కరుణాకరరావు, ఎంపిడిఒ చంద్రకుమారి, టిడిపి మండల అధ్యక్షుడు పైల బాబ్జి పాల్గొన్నారు.

సెమీస్‌లోకి శ్రీకాకుళం ప్రెస్‌క్లబ్

శ్రీకాకుళం సిటీ: గుంటూరులో ప్రారంభమైన అమరావతి రాష్ట్రస్థాయి మీడియా క్రికెట్ పోటీల్లో జిల్లాకు చెందిన జర్నలిస్టులు అద్భుత ప్రదర్శన ప్రదర్శించి సెమీస్‌కు చేరారు. గుంటూరులోని పోలీస్ పెరేడ్ మైదానంలో ఆతిథ్య జట్టు గుంటూరు జట్టుపై ఐదు వికెట్ తేడాతో ఘనవిజయం సాధించింది. తొలిత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న గుంటూరు జట్టు నిర్ణీత 14 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 106 పరుగులు చేసింది. జట్టులో బి.రాము 28, సచిన్ 22 పరుగులు చేశారు. ప్రెస్‌క్లబ్ జట్టులో చంద్రమౌళి 3 వికెట్లు, మహేష్ 2 వికెట్లు, రాఘవ్, సాయి చెరో ఒక వికెట్ తీసుకున్నారు. అనంతరం 107 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన జిల్లా ప్రెస్‌క్లబ్ జట్టు కేవలం 5 వికెట్లు కోల్పోయి 11.5 ఓవర్లో విజయాన్ని అందుకుంది. బ్యాటింగ్‌లో మహేష్ 30 బంతుల్లో 57 రన్స్ చేసి జట్టుకి అద్భుత విజయాన్ని అందించాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా... మహేష్ తన పట్టుదలను విడిచిపెట్టకుండా జట్టును విజయం వైపు నడిపించారు.